తెలంగాణ ఈసీగా రాణికుముదిని

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని రాణికుముదినిని ప్రభుత్వం నియమించింది. ఆమె బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేండ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఇప్పటివరకు కమిషనర్‌గా ఉన్న పార్థసారథి పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో రాణికుముదినిని ప్రభుత్వం నియమించింది. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణికుముదిని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కార్మికశాఖలో పనిచేసి గతేడాది జూన్‌లో పదవీవిరమణ చేశారు. ఆమె గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గానే కాకుండా వివిధ శాఖల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర వ్యవసాయ శాఖలోనూ ఆమె పనిచేశారు.

'విజిలెన్స్' కమిషనర్‌గా గోపాల్ బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్ బుధవారం కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గోపాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పంపిన ఉత్తర్వులు జారీచేసింది. గవర్నర్ నుంచి ఆమోదం లభించగానే రాష్ట్ర సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఆ ఉత్తర్వుల్లో మొదట 17.09.2022 అని తప్పుడు తేదీతో ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తప్పును సవరిస్తూ మరో కాపీని విడుదల చేసింది. ఈమేరకు గోపాల్ విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

కొత్తగా తొమ్మిది ఇంజినీరింగ్ కాలేజీలు

- ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అప్‌గ్రేడ్‌కు కసరత్తు
- వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికే ఒక కాలేజీ ఏర్పాటు కాగా, కొత్తగా మరో 9 ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇవి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు కాగా, వీటిని ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్‌చేస్తారు. వీటిల్లో పాలిటెక్నిక్ కోర్సులతో పాటు ఇంజినీరింగ్ కోర్సులు నిర్వహిస్తారు. మాసాబ్‌ట్యాంక్, రామంతాపూర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, కొత్తగూడెం, సికింద్రాబాద్(మారేడ్‌పల్లి), కులీకుతుబ్‌షా పాలిటెక్నిక్ ఓల్డ్ సిటీ కాలేజీలను ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్‌చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో విద్యారంగ సంస్కరణలపై చర్చ జరిగింది. ఆయా కాలేజీల ఏర్పాటును వేగవంతం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. సమావేశాల అనంతరం ఫైల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలనకు పంపిస్తారు. ఈ తొమ్మిది ఇంజినీరింగ్ కాలేజీలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి రానున్నాయి.

కొత్తగా రెండు ఆర్జీయూకేటీలు

ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో ఏర్పాటుకు యత్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా మరో రెండు ఆర్జీయూకేటీలు ఏర్పాటుకానున్నాయి. వీటిని ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. విద్యాశాఖ అధికారులు విద్యాసంస్కరణ క్యాబినెట్ సబ్ కమిటీ ముందు ప్రతిపాదనలు ఉంచారు. వెయ్యి సీట్లతో ఒక్కో కాలేజీని ప్రారంభించేందుకు అనుమతించాలని నివేదించారు. రాష్ట్రంలో ప్రస్తుతం బాసరలో ఆర్జీయూకేటీని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఏపీలో మూడు ఆర్జీయూకేటీలుండగా, రాష్ట్ర విభజనతో రెండు ఏపీకి వెళ్లడంతో ఉన్న ఒక్క ఆర్జీయూకేటీపై అధిక ఒత్తిడిపడుతున్నది. సీట్ల కోసం తీవ్రమైన డిమాండ్ ఉంటుంది. దీంతో కొత్తగా రెండు ఆర్జీయూకేటీలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే ఉత్తర తెలంగాణలో ఈ ఆర్జీయూకేటీ ఉండగా, దక్షిణంలో మహబూబ్‌నగర్, తూర్పున ఖమ్మంలో కొత్తగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ ఆర్జీయూకేటీలు బాసర ఆర్జీయూకేటీ కిందే నడుస్తాయి. ఆ వైస్‌చాన్స్‌లరే ఈ రెండింటిని పర్యవేక్షిస్తారు. ఒక్కో ఆర్జీయూకేటీ నిర్మాణానికి రూ.400కోట్లు అవసరమవుతాయని, ఏడాదికి రూ.100కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని అధికారులు ప్రతిపాదించారు. వీటిలోనూ ఆరేండ్ల బీటెక్ కోర్సులను నిర్వహించనుండగా, 10 జీపీఏ ఆధారంగా సీట్లను భర్తీచేస్తారు.

చాక్‌పీసులకూ డబ్బుల్లేవ్!

- రాష్ట్రంలో గాడి తప్పిన పాఠశాలల నిర్వహణ
- మూడు నెలలైనా విడుదల కాని నిధులు
- హెచ్ఎంలు సొంతంగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి
- పారిశుద్ధ్య కార్మికులకూ జీతాలు ఇవ్వలేక అవస్థలు

మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులైన్ ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 17: 'చాక్‌పీసులు, డస్టర్లు కొనలేకపోతున్నాం.. పిల్లలకు అవసరమైన చార్టులు, పుస్తకాలు తెద్దామంటే డబ్బులు లేవు.. సమావేశాలకు వచ్చే టీచర్లకు టీ, స్నాక్స్ ఇవ్వలేకపోతున్నాం.. మొత్తంగా పాఠశాలల నిర్వహణ ఇబ్బందిగా మారింది..' అంటూ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలకు రావాల్సిన గ్రాంట్లను ప్రభుత్వం విడుదల చేయకపోవడమే ఇందుకు కారణం. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా గ్రాంట్లు విడుదల కాలేదు.

- ప్రభుత్వం ఆయా పాఠశాలల నిర్వహణకు ఏడాదికి రెండుసార్లు నిధులు మంజూరు చేస్తుంది. దీంతో సౌకర్యాలు కల్పించేందుకు పెద్దగా ఇబ్బంది ఉండదు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా.. పాఠశాలలకు ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించి, సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 3,215 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మూడు లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో చాక్‌పీసులు మొదలుకొని హాజరు రిజిస్టర్లు, ఏ-4 సైజు పేపర్లు, చీపుర్లు, మరుగుదొడ్ల క్లీనింగ్ రసాయనాలు, విరిగిపోయిన వస్తువుల స్థానంలో కొత్తవి కొనడం, ప్లాస్టిక్ బకెట్లు, సబ్బులు ఇతర అవసరమైన సామగ్రి, ప్రయోగశాల రసాయనాలను పాఠశాల గ్రాంట్ నుంచి కొనుగోలు చేయాలి.

క్రీడా పరికరాలకు నిధుల్లేవు

ఇటీవల పీఈటీలకు పీడీలుగా పదోన్నతి కల్పించారు. విద్యార్థులకు పలు పాఠశాలల్లో క్రీడా పరికరాలు లేవు. క్రీడల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారు. ఈసారి నిధులు మంజూరు చేస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు విడుతల్లో మంజూరు కావాల్సిన నిధులు (రూపాయిల్లో)..

విద్యార్థుల సంఖ్య	మొత్తం
1 నుంచి 30 మంది	10,000
31 నుంచి 100	25,000
101 నుంచి 250	50,000
251 నుంచి 1000	75,000
1000కి పైన ఉంటే	1,00,000

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	859	72,124
నాగర్‌కర్నూల్	825	69,517
వనపర్తి	536	47,806
నారాయణపేట	512	59,870
జోగుళాంబ-గద్వాల	483	52,509

సొంతంగా ఖర్చు చేస్తున్నాం

పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలైనా నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. దీంతో పాఠశాలలో రోజూవారి నిర్వహణ ఖర్చులు, సుద్దముక్కలు, స్టేషనరీ, ఇతరత్రా ఖర్చులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

- అబ్దుల్‌హక్, తెలంగాణ రాష్ట్ర జీహెచ్ఎం సంఘం మహబూబ్‌నగర్ ప్రధాన కార్యదర్శి

చాలా ఇబ్బందికరంగా ఉంది

పాఠశాలల నిర్వహణ నిధులు లేవు. పాఠశాలల్లో పరిశుభ్రత పనులు చేసే వారికి సైతం చెల్లించేందుకు నిధులు లేవు. అమ్మా డబ్బులు ఇస్తారా? ఎప్పుడిస్తారు? అని స్కావెంజర్లు అడుగుతున్నారు. వారికి ఏమీ చెప్పలేకపోతున్నాం.

- పీఆర్ మాలినీదేవి, జీహెచ్ఎం, కలివెన, భూత్పూరు మండలం, మహబూబ్‌నగర్

క్రీడలపై నిర్లక్ష్యం

పాఠశాలలు తెరిచిన వెంబడే పుస్తకాలు, యూనిఫాంలు ఇస్తారు. క్రీడా సామగ్రి మాత్రం ఇవ్వరు. ఈ రోజు స్కూల్‌గేమ్స్ ప్రారంభం అయ్యాయి. పాఠశాలల ప్రారంభం రోజునే క్రీడాసామగ్రి ఇవ్వడంతోపాటు క్రీడల నిర్వహణకు నిధులు కేటాయించాలి.

- వడ్డెన్న, పీఈటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

త్వరలోనే నిధులు విడుదల

పాఠశాలల నిర్వహణకు అవసరమైన నిధులు త్వరలో విడుదల కానున్నాయి. హెచ్ఎంలు తాము పెట్టిన ఖర్చు వివరాల దస్త్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. నిధులు వచ్చిన తర్వాత వాటినుంచి ఖర్చుల లెక్కలు సరిచూసుకుని మిగిలిన డబ్బులు నిర్వహణ నిధుల కింద వాడుకోవాలని సూచించాం.

- రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్

మహబూబాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆటో ట్రాలీలో కుక్కి విద్యార్థుల తరలింపు

బడి పిల్లలా.. కోడిపిల్లలా?

- విద్యార్థులను తరలించేది ఇలాగేనా?
- పశువుల్లాగా డీసీఎం, ఆటో ట్రాలీల్లో తరలింపు
- మండిపడుతున్న ప్రజలు, విద్యార్థి సంఘాలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 17: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం అధికారిక కార్యక్రమానికి స్కూల్ పిల్లలను వాహనాల్లో కోడిపిల్లల్లా కుక్కి తరలించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ జాతీయ జెండా ఆవిష్కరణకు ప్రజలు, రైతులు రాకపోవడంతో విద్యార్థులను డీసీఎం వాహనం, ఆటోల్లో తరలించిన తీరు చర్చనీయాంశమైంది. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ రామచంద్రూ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అధికారులు మినహా ప్రజలు, రైతులు హాజరుకాలేదు. ఎక్కువ సంఖ్యలో జనం ఉండాలని భావించిన అధికారులు విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పశువుల్లాగా డీసీఎం వాహనంలో తరలించారు. మీడియా వారు చూసి ఫొటోలు తీసే ప్రయత్నం చేయడంతో డీసీఎం వాహనాన్ని మధ్యలో ఆపి ప్యాసింజర్ ఆటోలు, ట్రాలీ ఆటోల్లో పరిమితికి మించి కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. డీసీఎం, ఆటో ట్రాలీలో తరలించడాన్ని రోడ్డు వెంట చూసిన పలువురు విద్యార్థుల జీవితాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని, వారికి ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని చర్చించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పశువుల్లా డీసీఎం వాహనంలో తరలించడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సూర్య ప్రకాశ్, కేలోత్ సాయి ఖండించారు.

మహబూబాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి జనం లేకపోవడంతో డీసీఎంలో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు

ఎల్ఎల్ఎం కోర్సుల్లో 990 సీట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): లా పీజీ కోర్సు అయిన ఎల్ఎల్ఎం కోర్సుల్లో ఈ ఏడాది 990 సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. ఆయా సీట్ల భర్తీ షెడ్యూల్‌లో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. ఎల్ఎల్‌బీ బ్యాక్‌ల్యాగ్ ఫలితాలు ఇటీవలే విడుదల కావడంతో అభ్యర్థుల కోరిక మేరకు షెడ్యూల్‌ను సవరించారు. 24 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశముండగా, ఇప్పటి వరకు 2వేల మంది చేసుకున్నారు. 25న అర్హుల జాబితాను ప్రదర్శిస్తారు. 26, 27న వెబ్ ఆప్షన్లు, 28న సవరణ, 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందినవారు అక్టోబర్ 1 నుంచి 5 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని, ఫీజు చెల్లించి రిపోర్ట్‌చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు.

టాపర్ల చూపు.. బాంబే ఐఐటీ వైపు

ఆ తర్వాత ఢిల్లీ, మద్రాస్ ఐఐటీలు • ఆ మూడింటివైపే ప్రతిభావంతుల చూపు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌లో సత్తాచాటిన టాపర్లు మొదటి జనరేషన్ ఐఐటీల్లోనే చేరుతున్నారు. ఐఐటీ బాంబేనే తమ మొదటి ఛాయిస్‌గా ఎంచుకుంటున్నారు. ఆ తర్వాత ఐఐటీ ఢిల్లీ, మద్రాస్‌ను ఎంచుకుంటున్నారు. సీట్లు రాని వారు మాత్రమే రెండోతరం ఐఐటీల్లో చేరుతున్నారు. ఇదే విషయం జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 జాయింట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ రిపోర్ట్‌లో వెల్లడైంది. ఇటీవలే ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది ఐఐటీల్లో 17,695 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అత్యధికంగా ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 1,915 మంది చేరగా, ఆ తర్వాత ఐఐటీ వారణాసిలో 1,572, ఐఐటీ బాంబేలో 1,371, ఐఐటీ రూర్కీలో 1,351 మంది చొప్పున ప్రవేశాలు పొందారు. ఐఐటీ హైదరాబాద్‌లో 595 సీట్లుండగా, 597 మంది చేరారు.

ఓపీ విభాగానికి తాళం వేడయంతో లోపల చిక్కుకుపోయిన రోగులకు అభివాదం చేస్తున్న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ

ఇది జైలు కాదు దవాఖాన!

- వరంగల్ ఎంజీఎంలో రోగులు ఉండగానే ఓపీ విభాగం గేట్లకు పోలీసుల తాళం
- అభివాదం చేసుకుంటూ వెళ్లిన మంత్రులు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 17: నూతన యంత్రాన్ని ప్రారంభించడానికి ఇద్దరు మంత్రులు ఎంజీఎం దవాఖానకు రావడంతో ఓపీ విభాగంలో రోగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మంగళవారం ఎంజీఎం బ్లడ్ బ్యాంకులో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ) యంత్రాన్ని ప్రారంభించడానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండాసురేఖ దవాఖానకు చేరుకున్నారు. మంత్రులకు రోగులు ఎదురుపడకుండా ఉండాలని భావించిన పోలీసులు... వారిని ఓపీ విభాగానికి ఉన్న నాలుగు ద్వారాల్లో మూడింటికి తాళాలు వేశారు. ఓపీ సేవల కోసం వచ్చి పరీక్షలు నిర్వహించుకున్న రోగులు తిరిగి బయటకు వెళ్లడానికి వీలు లేకుండా అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. దీనికి తోడు ఓపీ విభాగంలో మందులు అందించే నాలుగు కౌంటర్లను సైతం మూసివేసి ఓపీ విభాగంలోనే తాత్కాలికంగా ఏర్పాటు చేయడంతో మందులు తీసుకోవడానికి, తిరిగి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు, నడవలేని వారు చేసేదేమీ లేక అక్కడే వేచి ఉండాల్సి వచ్చింది. ఇది లావుండగా తాళాలు వేయడంతో గేటు లోపలే ఉన్న రోగులకు మంత్రులు అభివాదం చేసుకుంటూ వెళ్లడం కొసమెరుపు.

ఇద్దరు బాలికలపై లైంగికదాడులు

మేడిపల్లి, ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఘటనలు

పీర్జాదిగూడ/రామచంద్రాపురం, సెప్టెంబర్ 17: రెండు వేర్వేరు చోట్ల ఇద్దరు బాలికలపై లైంగిక దాడులు జరిగాయి. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలో మంగళవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ మైనర్ బాలిక స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతూ బంధువుల వద్ద ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన కేశవరెడ్డి అనే యువకుడు వారి ఇంట్లోకి దూరి గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్టు సదరు బాలిక తమ బంధువులకు తెలిపింది. దీంతో వారు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సదరు యువకుడు పరారీలో ఉన్నట్టు వారు పేర్కొన్నారు.

ఆర్సీపురం పరిధిలో..

సంగారెడ్డి జిల్లా ఆర్సీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉండే 17 ఏండ్ల బాలుడు ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఏడేండ్ల బాలిక ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆర్సీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శశికాంత్‌రెడ్డి బాలుడిని అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల అన్నం మాకొద్దు

- కుక్కల కన్నా హీనంగా చూస్తున్నరు
- హాలియా బీసీ గురుకులం విద్యార్థినుల ఆందోళన

హాలియాలో ఆందోళనకు దిగిన బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు

హాలియా, సెప్టెంబర్ 17: సరైన భోజనం అందడంలేదని, చదువు సరిగా చెప్పడంలేదని, పట్టించుకునే వారులేరని, తమను కుక్కల కన్నా హీనంగా చూస్తున్నారంటూ నల్లగొండ జిల్లా హాలియాలోని బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. 'పురుగుల అన్నం మాకొద్దు.. ఈ ప్రిన్సిపాల్, చదువు చెప్పరాని టీచర్లు వద్దు' అంటూ మంగళవారం మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి మంజూరైన బీసీ గురుకుల పాఠశాలను అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో హాలియాలోని నిర్మల ఉన్నత పాఠశాల భవనంలో ఏర్పాటుచేశారు. మూడేండ్ల నుంచి ఇక్కడే నిర్వహిస్తున్నారు. నిరుటి వరకు చదువు బాగానే ఉంది. భోజనం కూడా మెనూ ప్రకారం అందేది. పదో తరగతిలో మంచి రిజల్ట్ కూడా వచ్చాయి. కాగా, గత నెలలో ప్రభుత్వం గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టింది. ఇక్కడి ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో క్రాంతి వచ్చారు. అప్పటి నుంచి మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, భోజనం, టిఫిన్‌లో పురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు సక్రమంగా బోధించడం లేదని ఆందోళనకు దిగారు. తాము చెప్పిన ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని, అన్నింటికీ అడ్జస్ట్ కావాలని టీచర్లు చెబుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మూకుమ్మడిగా టీసీలు తీసుకుని పాఠశాల విడిచి వెళ్లిపోతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, వంట మాస్టర్ మారడం వల్ల భోజనంలో పురుగులు వస్తున్నాయని, సమస్యను పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ క్రాంతి చెప్పుకొచ్చారు.

అన్నంలో పురుగులు వస్తున్నాయి

కొత్త ప్రిన్సిపాల్ వచ్చిన దగ్గరి నుంచి స్కూల్‌లో సమస్యలు మొదలయ్యాయి. స్టూడెంట్స్ చెప్పిన ఏ సమస్యనూ పట్టించుకోవడం లేదు. చదువు బాగాలేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని చాలా మంది విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయారు.

-దుర్గ, ఇంటర్మీడియట్ విద్యార్థిని

పాఠాలు అర్థమవడం లేదు

మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. అన్నంలో పురుగులు వస్తున్నాయి. సమస్యలను టీచర్ల దృష్టికి తీసుకెళ్తే సర్దుకుపోవాలంటున్నారు. సబ్జెక్టులు కూడా బాగా చెప్పడం లేదు. పాఠాలు అర్థమవడం లేదు. మమ్ముల్ని ఇక్కడ కుక్కల కంటే హీనంగా చూస్తున్నారు.

-సుప్రజ, పదో తరగతి విద్యార్థిని

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో మెనూ ప్రకారం భోజనం, చక్కటి విద్యాబోధన అందేది. ప్రస్తుతం రాష్ట్రంలో గురుకులాల నిర్వహణ అధ్వానంగా మారింది. గురుకుల పాఠశాలలను బాగా నడిపిస్తే కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నది. పేద విద్యార్థుల చదువుపై కక్ష గట్టడం దుర్మార్గం. హాలియా బీసీ గురుకుల పాఠశాలలో సమస్యలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి.

-నోముల భగత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

లీటరు పల్లీ నూనె 170!

పామాయిల్ లీటరుపై రూ.15-20 పెంపు • పెరిగిన వంటనూనెల ధరలు • దిగుమతి సుంకాన్ని పెంచడమే కారణం

> ఈ సారి దసరా, దీపావళికి బూరలు, గారెలు చేసుకోవడం కష్టంగానేకనిపిస్తున్నది. కిలో వంటనూనె ధర రూ.15 నుంచి రూ.20వరకు పెరిగింది. ఇప్పటికే ఓ వైపు కూరగాయల ధరలు మండిపోతుండటం.. మరోవైపు వంటనూనెల ధరలు భగ్గుమంటుండటంతో సామాన్యుడు లబోదిబోమంటున్నాడు.

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం పండుగల వేళ ప్రజలకు భారీ షాక్ ఇచ్చింది. వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకు పెంచేసింది. దీంతో సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్‌పై ఇంపోర్ట్ టాక్స్ 12.5 శాతం నుంచి 32.5 శాతానికి చేరింది. దేశంలో నూనె గింజల ధరలు క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులను ఆదుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఇంపోర్ట్ టాక్స్ పెంపుతో వంట నూనెల ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. మొత్తంగా ముడి నూనెలపై సుంకం 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, రిఫైన్డ్ నూనెలపై సుంకం 13.75 శాతం నుంచి 35.75 శాతానికి పెరిగింది.

అన్ని నూనెలూ భారమే

కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచడంతో అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒక్కసారిగా రూ.15-20 వరకు పెరిగాయి. పామాయిల్ ధర రూ.100 నుంచి రూ.115-120, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 నుంచి రూ.130-140, వేరుశనగ నూనె రూ.155 నుంచి రూ.165-170కు చేరింది. పూజలకు ఉపయోగించే నూనెలనూ రూ.110 నుంచి రూ.120-125కి పెంచి అమ్ముతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారు. స్టాక్ లేదంటూ బోర్డులు పెట్టి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మరికొందరు పాత స్టాక్‌ను కూడా అధిక ధరలకు అమ్ముతున్నారు. కేవలం రెండు రోజుల్లోనే లీటరు నూనె ధర రూ.20 పెరుగడంతో వినియోగదారుడు నోరెళ్లబెడుతున్నాడు. ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

రకం	గత ధర	ఇప్పుడు
పామాయిల్	రూ.100	రూ.115-120
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ.115	రూ.130-140
వేరుశనగ నూనె	రూ.155	రూ.165-170
పూజలకువాడే నూనె	రూ.110	రూ.120-125

గత నెలలో 16 శాతం తగ్గిన దిగుమతులు: ఎస్ఈఏ

దేశంలో 2023 ఆగస్టుతో పోలిస్తే గత నెలలో వంట నూనె దిగుమతులు 16 శాతం తగ్గినట్టు సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) నివేదిక వెల్లడించింది. నిరుడు ఆగస్టులో 18.66 లక్షల టన్నుల వంట నూనెలను దిగుమతి చేసుకుంటే.. గతనెలలో 15.63 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్టు తెలిపింది. దిగుమతుల తగ్గుదల ఉన్నప్పటికీ 2023-24లో భారత్ వంట నూనె దిగుమతులు 160 నుంచి 165 లక్షల మెట్రిక్ టన్నుల మధ్య ఉంటాయని ఎస్ఈఏ అంచనా వేస్తున్నది. ఇది గత ఏడాది సంఖ్యలకు దగ్గరగా ఉన్నది.